
ఆంధ్రజ్యోతి



నంద్యాల
జిల్లా వార్తలు
5
ఆదివారం 20 జూలై 2025

హుషారుగా..

ఈ ఏడాది మే నెలలో కురిసిన ముందస్తు వర్షాలతోనే రైతులు సాగు సిద్ధమయ్యారు. అయితే దాదాపు నెలన్నర నుంచి వర్షాలు లేక పంటలు ఎండు ముఖం పట్టాయి. ఇటీవలే కూటమి ప్రభుత్వం రైతుల కోసం ప్రాజెక్టుల నుంచి కాల్వలకు నీటిని విడుదల చేసింది. ఒట్టిపోయిన సాగునీటి కాల్వలు ఒక్కసారిగా నిండుకుండలా మారాయి. వీటికి తోడు రెండు రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలతో అన్నదాత మళ్లీ సాగుకు సిద్ధమయ్యాడు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను బేరీజు వేసుకుని అధికారులు ఆయా కాల్వలకు నీటిని విడుదల చేశారు. స్వల్ప, మధ్యకాలిక వరి రకాలకు ఆగస్టు 20వ తేదీ వరకు సాగుకు అవకాశం ఉండగా రైతులు పొలం మడులను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో వివిధ పంటలకు సమయం లేదని వస్తున్నది అవాస్తవం.. ఎలాంటి ఆందోళన చెందవద్దని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- నిండుకుండలా కాల్వలు
- జోరుగా వరి నాట్లు
- వేరుశనగకు సమయం ఉందంటున్న శాస్త్రవేత్తలు
- ఎరువుల కొరత లేదన్న వ్యవసాయాధికారులు



వరి నాట్లు వేస్తున్న కూలీలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న అడపాదడపా వర్షాలతో పాటు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఖరీఫ్ పంటలకు 20 రోజులు ముందుగానే కాల్వలకు నీటిని వదలడంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. వారం రోజుల క్రితం వెలవెలబోయిన కాల్వలు ఇప్పుడు నిండుకుండలా మారాయి. ముందస్తుగా కురిసిన వర్షాలకు అత్యధికంగా రైతులు మొక్కజొన్న పంట వేశారు. వర్షాలు కురవక అనేక మంది రైతులు పలు పంటలను దున్నేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వల్పకాలిక, మధ్యకాలిక వరి రకాలకు ఆగస్టు 20వతేదీ వరకు సాగుకు అవకాశం ఉండగా రైతులు పొలం మడులను సిద్ధం చేస్తున్నారు. రానున్న 20 రోజుల్లో అధికారుల అంచనాలను మించి వరి పంట సాగుచేసే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం 30శాతం మేర వరి నాట్లు వేశారు. ఎరువులు కొరత లేకుండా వ్యవసాయాధికారులు నిల్వలను సిద్ధం చేశారు. యూరియా కొంతమేర కలవరపెడుతున్నప్పటికీ ఊహాగానాలేనని, యూరియా కూడా సరిపడా నిల్వలున్నాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు భరోసానిస్తున్నారు.



పరుగులు పెడుతున్న కృష్ణమ్మ (తెలుగు గంగ కాల్వ)

ఎరువులు నిల్వలు ఇలా...

జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి 1,61,617 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటికే హోల్‌సేల్, రీటైల్ డీలర్ల వద్ద నుంచి 48,731 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయించారు. ప్రస్తుతం హోల్‌సేల్, రీటైల్ డీలర్ల వద్ద యూరియా 12,241 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4696 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4348 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకేఎస్ 29,423 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1907 మెట్రిక్‌టన్నులతో కలిపి మొత్తం 52,614 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వలున్నాయి. మార్క్‌ఫెడ్ నుంచి 9,097.8 మెట్రిక్ టన్నులు విక్రయించగా ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వద్ద యూరియా 2653 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,183 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 25 మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి.

వర్షాలను బేరీజు వేసుకుని..

జిల్లాలోని అన్ని నీటి ప్రాజెక్టులలో నుంచి కాల్వలకు నీటిని విడుదల చేశారు. ప్రాథమికంగా కొంతమేర నీటిని విడుదల చేసినప్పటికీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను బేరీజు వేసుకుని అధికారులు ఆయా కాల్వలకు నీటిని విడుదల చేశారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(వీబీఆర్) నుంచి తెలుగుగంగ కాల్వకు 5100 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి కేసీ కెనాల్‌కు 2300 క్యూసెక్కులు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీ కాల్వకు 4000 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. అలాగే మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి హెచ్ఎన్ఎస్ఎస్(హంద్రీనీవా సుజల స్రవంతి)కు మూడు పంపుల ద్వారా 1188 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.


నీటిని వృథా చేయవద్దు



ప్రస్తుతం రైతులకు నీరు ఎంతమేరకు అవసరం అవుతుందో అంచనా వేసి జలాశయాల నుంచి ఆయా కాల్వల ద్వారా నీటిని విడుదల చేశాం. రైతులు వారి అవసరాలను బట్టి నీటిని వృథా చేయకుండా వాడుకోవాలి. చివరి ఆయకట్టు వరకు నీటిని అందిస్తాం.

● ప్రతాప్, ఈఈ, జలవనరుల శాఖ, నంద్యాల

20 రోజులు ముందుగానే..



గతంలో ఎన్నడూ లేని విధంగా వానకారు పంటకు 20 రోజులు ముందుగానే నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉంది. వరి నాట్లు వేస్తున్నాం. ప్రతియేటా రెండు పంటలనే వేస్తున్నాం. ఈ సారి ఆరుతడి పంటతో కలిపి మూడు పంటలకు అవకాశం ఉంటుందని భావిస్తున్నా.

● సోమన్న, రైతు, పెద్దకొట్టాల

వేరుశనగ పంటను వేసేందుకు..



జిల్లాలో వివిధ పంటలకు సమయం లేదని వస్తున్నది అవాస్తవం. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. వేరుశనగ పంటను వేసేందుకు ఆగస్టు మొదటి వారం వరకు, పత్తి, చిరుధాన్యాల పంటలు ఈనెలాఖరు వరకు వేసుకోవచ్చు. ఎర్రనేలలో 50ఎంఎం, నల్లరేగడి నేలల్లో 70 ఎంఎం తడి ఉంటే విత్తనాలను విత్తుకోవచ్చు. నీళ్లు అందని రైతులు నేరుగా గొర్రుతో కూడా విత్తనాలు వేసుకోవచ్చు.

● సుధాకర్, శాస్త్రవేత్త, కేవీకే, బనగానపల్లె

మహానందీశ్వరుడి హుండీ లెక్కింపు

● ఆదాయం రూ.48.61లక్షలు



మహానందిలో హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శనివారం హుండీని లెక్కించారు. దేవస్థానానికి రూ.48.61లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అభిషేకమండపంలో ఉభయదేవాలయాల్లోని హుండీలతో పాటు గోశాల, అన్నదానం వద్ద ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు వేసిన కానుకలను సిబ్బంది సహాయంతో లెక్కించారు. ప్రధాన ఆలయాల్లోని హుండీల ద్వారా రూ.48.45 లక్షలు, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ.327 82-00, గోసంరక్షణ హుండీ ద్వారా రూ.24,283 తో పాటు బంగారం 9గ్రాముల 90 మిల్లీ గ్రాములు, వెండి 470గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈలెక్కింపులో జిల్లా దేవదాయశాఖ అధికారి మోహన్, గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, పసుపుల సుబ్బారెడ్డితో పాటు బాలాజి సేవాసమితి, శ్రీరామ సేవ ట్రస్ట్ సేవకులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్ సత్వరమే ఏర్పాటుచేయాలి

● ఏపీ ఎన్జీవోస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వెంగళరెడ్డి



మాట్లాడుతున్న వెంగళరెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ కమిషన్ సత్వరమే ఏర్పాటుచేయాలని ఏపీ ఎన్జీవోస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వెంగళరెడ్డి పేర్కొన్నారు. నంద్యాల ఎన్జీవోస్ హోంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల కార్యవర్గసభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వెంగళరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్జీవో సమాచారం మాసపత్రికలో సభ్యులను చేర్పించాలన్నారు. సమావేశంలో నంద్యాల తాలుకా అధ్యక్షులు హుశ్శేన్‌రెడ్డి, కార్యదర్శి నరసారెడ్డి, మనిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల ఎస్బీ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

● ఉత్తర్వులు జారీచేసిన ఆ శాఖ డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా



నంద్యాల, జూలై19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖ పరిధిలోని ఎస్బీ(స్పెషల్ బ్రాంచ్) డీఎస్పీగా పి. శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు డీఎస్పీలను బదిలీ చేస్తూ శనివారం ఆశాఖ డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఇక్కడికి కేటాయించారు. ఈయన గతంలో నంద్యాల సబ్ డివిజన్ డీఎస్పీగా పని చేశారు. గతంలో ఎస్బీ డీఎస్పీగా పనిచేసిన సంతోష్ గత ఏడాది నవంబర్‌లో పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎస్బీ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది. తాజాగా నూతన డీఎస్పీగా శ్రీనివాసరెడ్డిని నియమించడంతో రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏది ఏమైనా ఎనిమిది నెలలుగా ఎస్బీ డీఎస్పీ స్థాయి అధికారి లేకపోవడంతో ఇద్దరు సీఐ స్థాయి అధికారులే నెట్టుకొచ్చారు.

అనుమతులు రద్దు చేయాల్సిందే..! 7

పంట పొలాలను కాపాడాలి

పరిసరాల శుభ్రత పాటించండి : కలెక్టర్



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కలిసి 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' నిర్వహించారు. వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత పెంపొందించడానికి ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీ విష్ణు చరణ్, డీఆర్వో రామునాయక్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

● విద్యుత్ ఎస్ఈ సుధాకర్ కుమార్

నంద్యాల కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ఎస్ఈ సుధాకర్ కుమార్ అన్నారు. నంద్యాల టెక్కెలోని విద్యుత్ కార్యాలయంలో శనివారం విద్యుత్ అదాలత్ ఛైర్మన్, రిటైర్డు జడ్జి జస్టిస్ శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఈతో పాటు ఆర్థిక సభ్యుడు మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, ఈఈ శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. విద్యుత్ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. నంద్యాల డివిజన్ పరిధిలోని మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల గురించి ఈ పరిష్కారవేదిక నిర్వహించారు. ఎనిమిది మంది విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదురూపంలో అర్జీలు అందజేశారు.

ప్లాస్టిక్‌ను రూపుమాపుదాం

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి

● కోవెలకుంట్లలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'



కోవెలకుంట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి బీసీ, ఇతరులు

కోవెలకుంట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని హరించే ప్లాస్టిక్‌ను కలసికట్టుగా రూపుమాపాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన రెడ్డి పిలుపునిచ్చారు. కోవెలకుంట్ల పట్టణంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి బీసీ పాల్గొన్నారు. కోవెలకుంట్ల పట్టణాన్ని ప్లాస్టిక్‌రహిత పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండు సర్కిల్‌లో మానవహారం నిర్వహించి విద్యార్థులచే మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంత్రి బీసీ మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గత కొంతకాలంగా బీసీ ఇందిరమ్మ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అందుకు అధికారులు వ్యాపార సముదాయాల యజమానులు, విద్యార్థులు అందరూ సహకరించడంతోనే అది సాధ్యమవుతోందన్నారు. కోవెలకుంట్ల పట్టణంలో కూడా అన్ని వర్గాల వారు సహకరించినపుడే ప్లాస్టిక్ రహిత కోవెలకుంట్ల ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు, ప్రత్యేక అధికారి సోమశివారెడ్డి, సీఐ హనుమంతనాయక్, ఎస్ఐలు మల్లిఖార్జున రెడ్డి, రమణయ్య, కోవెలకుంట్ల సొసైటీ ఛైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి, నాయకులు ఎస్ఏ గఫూర్, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, మద్దిలేటి, సుందర్ రెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, మురళి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వరాలు!


- పింక్‌బుక్ విడుదల చేసిన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్
- ఉమ్మడి జిల్లా రైల్వే ప్రాజెక్టులకు భారీగా నిధులు
- రైల్వే కోచ్ పరిశ్రమకు రూ.540.14 కోట్లు
- మంత్రాలయం - కర్నూలు రైల్వేలైన్ రీసర్వేకు రూ.28 లక్షలు
- దూపాడు వద్ద అదనపు లైన్లు
- నంద్యాల - ఎర్రగుంట్ల రైలు మార్గం ఆధునికీకరణకు రూ.1,029 కోట్లు
- కర్నూలు సిటీ - దూపాడు మధ్య ఆర్‌ఓబీ నిర్మాణం
- వివిధ ప్రాజెక్టులకు రైల్వే బడ్జెట్-2025-26 కేటాయింపులు




కర్నూలు జిల్లా కేంద్రంలోని రైల్వే కోచ్ పరిశ్రమ

కర్నూలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే బడ్జెట్-2025-26 కేటాయింపుల వివరాలను రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రాజెక్టుల వారిగా నిధులు కేటాయింపులు చేసిన పింక్ బుక్‌ను విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భారీగా కేటాయింపులు చేశారు. దశాబ్ద కాలంగా నిర్మాణం జరుగుతున్న రైల్వే కోచ్ పరిశ్రమకు ఈ బడ్జెట్‌లో రూ.540.12 కోట్లు కేటాయించారు. త్వరలోనే ప్రారంభం అవుతుందని అధికారులు అంటున్నారు. పెండింగ్ ఫైళ్ల మధ్యలో చేరిందని భావించిన మంత్రాలయం- కర్నూలు సిటీ రైల్వేలైన్ రీ-సర్వేకు నిధులు కేటాయింపులు చేయడంతో ఈ మార్గం మనుగడలోకి వచ్చింది. రైల్వే ట్రాఫిక్ దృష్ట్యా దూపాడు స్టేషన్‌లో అదనపు రెండు రైల్వే లైన్లు, కర్నూలు-దూపాడు మధ్య రోడ్ ఓవర్ బ్రిడ్జి, నంద్యాల-ఎర్రగుంట్ల రైల్వే మార్గం డంబ్లింగ్, విద్యుద్ధీకరణ కోసం రూ.1,029 కోట్లు, కర్నూలు, ఆదోని స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి కోసం నిధులు ఇచ్చారు. మొత్తంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బడ్జెట్ కేటాయింపుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సముచిత స్థానం కల్పించారు.

కర్నూలు రూరల్ మండలం పంచలింగాల సమీపంలో రైల్వే కోచ్ మిడ్ - లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్ షాప్ (ఎంఎల్ఆర్)కు రూ.540.12కోట్లు కేటాయించారు. రాష్ట్ర విభజనకు ముందు అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలో రైల్వే శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి నాడు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఈ పరిశ్రమ తీసుకొచ్చారు. 2013-14లో రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం పొందింది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి రైల్వే కోచ్ పునరుద్ధరణ పరిశ్రమ ఇది. పంచాలింగాల గ్రామం దగ్గర 142 ఎకరాల్లో రూ.110 కోట్లతో నిర్మాణం చేపట్టారు. పదేళ్లుగా ఇక్కడ పనులు జరుతున్నాయి. ఇప్పటికే సుమారుగా రూ.350 కోట్లు ఖర్చుచేశారు. 85 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభించేలా రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ వర్క్‌షాప్ ప్రారంభమైతే మూడు వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. తాజాగా బడ్జెట్‌లో రూ.540.12 కోట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేటాయించడం కొసమెరుపు. సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి రైల్వే మంత్రిని కలసిన ప్రతిసారి ఈ పరిశ్రమ గురించి చర్చించినట్లు సమాచారం. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఈ వర్క్‌షాప్‌లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పిల్లల విద్యాభ్యాసం కోసం ఐదు ఎకరాల్లో కేంద్ర విద్యాలయం నిర్మాణం చేయాల్సి ఉంది.






కర్నూలు రైల్వే స్టేషన్

మంత్రాలయం - కర్నూలు రైల్వే లైన్ రీ సర్వే నిధులు

మంత్రాలయం రోడ్ - కర్నూలు సిటీ మధ్య 110 కి.మీలు రైల్వేలైన్ రీ సర్వేకు రూ.28 లక్షలు కేటాయించారు. బుట్టదాఖలైన ఈ రైలు మార్గానికి మోక్షం లభించనుంది. ఈ రైలు మార్గం 55 ఏళ్ల స్వప్నం. 1970లో అప్పటి కర్నూలు ఎంపీ వై.గాదిలింగన్నగౌడ్ తొలిసారిగా పార్లమెంట్‌లో గళమెత్తారు. పార్లమెంట్ మినిట్స్ బుక్‌లో కూడా నమోదైంది. ఆతరువాత 2003లో ఎంపీ కేఈ కృష్ణమూర్తి, ఉమ్మడి ఏపీ మంత్రి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ మోహన్‌రెడ్డి, నాటి రైల్వే బోర్డు సభ్యులు ఎర్రన్నాయుడు ద్వారా రైల్వే మంత్రి నితీశ్‌కుమార్‌ను కలసి విన్నవించారు. 2004 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మంత్రాలయం-కర్నూలు రైల్వేలైన్‌కు సర్వేకు

మిగతా 7లో...



నల్లమల అడవిలో ప్రకృతి అందాలను తిలకిస్తున్న ప్రయాణికులు



బ్రిటీషు వారు నిర్మించిన రైల్వే దిమ్మెలు నేటికీ పదిలంగా ఉన్న దృశ్యం



పొగమంచులో వెళ్తున్న గూడ్స్ రైలు

నల్లమల సోయగం.. మధురమైన ప్రయాణం..!

నల్లమల సోయగాలు వర్ణనాతీతం. ఇంతటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణం ఓ మధురమైన అనుభూతి. నల్లమలను కప్పేసిన పొగమంచు, ఎత్తయిన కొండలు, కొండల మీద పచ్చని వృక్షాలు ఉన్నాయి. వందల ఏళ్ల క్రితం బ్రిటీషు వారు నిర్మించిన రైల్వే వంతెన దిమ్మెలు నేటికీ పదిలంగా దర్శనమిస్తున్నాయి. రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజన్‌లోని చెలిమ రేంజ్‌లోని నంద్యాల - ఒంగోలు రహదారిలో సుమారు 18 కిమీ అటవీ ప్రయాణం ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. ఒంపుసొంపుల రహదారి, పరిఢవిల్లుతున్న పచ్చదనం మధ్య జర్నీ చేస్తే మైమరిచిపోవాల్సిందే. ఎత్తయిన కొండల మధ్య పచ్చని వృక్షాలతో రైల్వే పట్టాలు ఉన్నాయి. అటు రైల్వే, ఇటు రోడ్డు ప్రయాణికులకు నల్లమల శోభ ఆహ్లాదానిస్తోంది. జలపాతాలు, అరుదైన పక్షులు, వన్యప్రాణులు దర్శనంతో ప్రయాణం సాగుతోంది. టూరిస్టులను పచ్చదనం ఆకట్టుకుంటుంది. ఈ ముగ్ధ మనోహర దృశ్యాలను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

● రుద్రవరం, ఆంధ్రజ్యోతి



నంద్యాల - ఒంగోలు జాతీయ రహదారిలో పచ్చదనం పందిరి ఇలా..

పత్తికొండలో జిల్లా అధికారుల దాడులు

పెట్రోలు బంకు, దుకాణాల తనిఖీ..



పెట్రోలు బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పత్తికొండ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం జిల్లా అధికారులు పెట్రోలు బంకు, దుకాణాలు, వాటర్ ప్లాంట్స్, కూరగాయల షాపులు, హోటళ్లు, ఆసుపత్రులు, డాబాలపై దాడులు నిర్వహించారు. ఆర్డీవో భరత్ నాయక్‌తో కలిసి డీఎస్‌వో రఘువీర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, లీగల్ మెట్రాలజీ అధికారి తనిఖీలు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే లైసెన్సులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫుడ్ లైసెన్స్‌తో పాటు ఇతర సర్టిఫికెట్లను కలిగి ఉండాలన్నారు. కల్తీలేని నాణ్యమైన ఆహారాన్ని అందించాలని హోటళ్లు, డాబా యజమానులకు సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు, పలు శాఖల అధికారులు ఉన్నారు. కాగా అధికారులు వస్తారన్న సమాచారంతో పలు వ్యాపారులు దుకాణాలను మూసివేశారు.

ప్రాచీన పద్ధతిలో పనులు షురూ

- శ్రీశైలంలో వేగంగా నిర్మాణాలు
- పనులు చేపడుతున్న పుణేకు చెందిన సంస్థ



పురాతన పద్ధతిలో మిశ్రమాన్ని తయారు చేస్తున్న కార్మికులు

నంద్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఆలయాలతో పాటు ప్రాంగణంలోని పరివార ఆలయాల్లో పలు పైకప్పు.. లీకేజీ మరమ్మతు పనుల కోసం ఆలయ అధికారులు సిద్ధమయ్యారు. భారతీయ ప్రాచీన నిర్మాణ పద్ధతులను అనుసరించి పనులు చేపట్టాలని ఆలయ అధికారులు, అర్చకులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆ పనులను ఆలయ అధికారులు పూణేకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ ప్రతినిధులను కోరారు. దీంతో గత ఏడాది అక్టోబరు 2న ఆ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. దీంతో సుమారు రూ.3 కోట్లతో పనులు చేయాలని సదరు ట్రస్ట్ ప్రతినిధులు స్వచ్ఛందంగా ప్రాచీన పద్ధతుల్లో పనులు చేయడానికి ముందుకు వచ్చారు. ఆ సంస్థ గతంలో పలు దేవాలయాల్లో ఈ తరహా పనులు చేసిన విషయం తెలిసిందే. శ్రీశైలంలోని లడ్డుపోటు మండపం, సహస్ర దీపారాధన మండపం, లడ్డుపోటు దేవాలయం వెనుక, వీర శిరోమండపం తదితర మండపాలు పరంగా.. 3,17,988 చదరపు విస్తీర్ణం కలిగిన సదరు ఆలయాల్లో పనులు చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒప్పందం కుదుర్చుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభించారు.

ప్రాచీన పద్ధతిలో..

వేల సంవత్సరాల కిందట జరిగిన ప్రాచీన పద్ధతిని అనుసరించి మిశ్రమాన్ని చేసి నిర్మాణాలను సదరు ట్రస్ట్ శ్రీశైలంలో పనులను చేపట్టింది. ఎప్పటికప్పుడు వేగవంతంగా పనులు సాగుతున్నాయి. కరక్కాయపొడి, సున్నం, బెల్లం, కాల్చిన మట్టి, ఇటుక ముక్కలు, ఇటుకల పొడితో పాటు అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న బంకను వాడుతున్నారు. ఈ మిశ్రమాన్ని కలిసి వేర్వేరుగా పురాతన పద్ధతుల్లో కొన్ని రోజుల పాటు నానబెట్టి మిశ్రమం సిద్ధం చేసి పనులు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు బాధ్యతగా మెలగాలి

- ప్రభుత్వ సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు



మాట్లాడుతున్న రాష్ట్ర సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు

పాణ్యం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు సమాజంపై నైతిక బాధ్యతతో మెలగాలని రాష్ట్ర సాంకేతిక సలహాదారు ఎస్.కన్నయ్యనాయుడు పేర్కొన్నారు. 'డ్యాంలు, రిజర్వాయర్‌ల నిర్వహణ, భద్రత సుస్థిరతలో నిర్మాణ ఇంజనీర్ల బాధ్యత' అనే అంశంపై ఆర్జీఎం సివిల్ విభాగం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కన్నయ్యనాయుడు మాట్లాడుతూ జాతీయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, ప్రాజెక్టులలో ప్రధాన ఇంజనీరింగ్ శాఖలు, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ప్రాముఖ్యతను తెలిపారు. సమాజం పట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు నైతిక, సామాజిక బాధ్యత వహించాలన్నారు. ఈ ఫౌండేషన్ బ్రాంచ్‌లలో అడ్మిషన్లు తగ్గడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర డ్యాం వద్ద గేటు విఫలంతో ఏడు రోజుల్లో గేట్లు ఏర్పాటు చేసి సాగునీరు, తాగునీరు, వృథాను కాపాడామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ మాట్లాడుతూ భారతదేశం సాగునీటి ప్రాజెక్టుల్లో గేట్లు ఏర్పాటు చేయడంలో ప్రసిద్ధిగాంచిన కన్నయ్యనాయుడు తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన క్రస్టు గేటు స్థానంలో కేవలం వారం రోజుల్లో స్టాఫ్‌లాగ్ ఏర్పాటు చేసి హీరో ఆఫ్ తుంగభద్ర అనే పేరు సంపాదించారన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, సోమశిల, జూరాల, ప్రియదర్శిని ఆనకట్టల గేట్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా ప్రకాశం బ్యారేజీ గేటు నీటి మట్టం తగ్గించకుండానే మరమ్మతు చేపట్టడం ఆయన ఘనత అని కొనియాడారు. కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, రామిరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న రైతు బజారు



తడిసిన వేరుశనగ బస్తాలు



వర్షానికి మునిగిన రైతు బజార్

భారీ వర్షం

- ఆదోని మార్కెట్ యార్డులో తడిసిన వేరుశనగ
- చెరువును తలపిస్తున్న రైతు బజార్
- జలమయమైన ప్రధాన రహదారులు
- డ్రైనేజీలు సరిగా లేక పొంగిపొర్లిన మురుగు
- ఇబ్బందులు పడ్డ పట్టణ వాసులు



జలమయమైన మునిసిపల్ మెయిన్ రోడ్డు

ఆదోని అగ్రికల్చర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మధ్యాహ్నం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన వేరుశనగ దిగుబడులు వర్షానికి తడిసిపోయాయి. రైతులు గ్రామాల నుండి విక్రయానికి తెచ్చిన వేరుశనగ బస్తాలను ఆరుబయట ప్లాట్‌ఫారం పై టెండర్ కోసం కుప్పలుగా పోశారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు దుకాణ యజమానులతో మాట్లాడి మార్కెట్ యార్డు కార్యాలయంలో ఉన్న తార్పాలను తెచ్చి కప్పుకున్నారు. వేరుశనగ ఇప్పుడిప్పుడే చేతికందడంతో విక్రయానికి భారీగా తీసుకొస్తున్నారు. 2700 పైగా వేరుశనగ బస్తాలు రావడంతో తార్పాళ్లు అధికంగా లేకపోవడంతో కొంత మంది రైతులు అలాగే వదిలేయడంతో నష్టపోయారు. వేరుశనగ తడిచిపోవడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజార్‌లో వర్షపు నీరు చేరి చెరువును తలపించింది. కూరగాయలు అమ్మే రైతులు వినియోగదారులు వర్షపు నీరు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో ప్రధాన రహదారులు జలమయమ య్యాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మునిసిపల్ మెయిన్ రోడ్డులోని శ్రీనివాస భవన్ ఎదురుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. డ్రైనేజీలు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పొంగిపొర్లాయి.

జాతీయ బాక్సింగ్ పోటీలకు పొన్నాపురం విద్యార్థిని

- అభినందించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

నంద్యాల హాస్పిటల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు పొన్నాపురం జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థిని సుప్రియ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఐజయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 12నుంచి 14వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో సుప్రియ బంగారు పతకం సాధించిందన్నారు. ఆగస్టులో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని అన్నారు. విద్యార్థిని సుప్రియ, ఫిజికల్ డైరెక్టర్ బీహెచ్ విశ్వనాథ్‌ను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, సరోజ, గంగాధర్, రమణ, రసూల్‌బీ ప్రత్యేకంగా అభినందించారు. సుప్రియ జాతీయ స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరచి పాఠశాలకు పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

అనుమతులు రద్దు చేయాల్సిందే..!

- మైనింగ్ అధికారులను అడ్డుకున్న గ్రామస్థులు
- దాదపు అరగంట పాటు రోడ్డుపై బైఠాయింపు
- మైనింగ్ లీజు రద్దుకు కలెక్టర్‌కు నివేదిస్తాం
- మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్



కొండల్లో మైనింగ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు



అధికారుల వాహనాన్ని అడ్డుకుని నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ఆలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాల్సిందేనని గ్రామస్థులు పట్టుబట్టారు. శనివారం పరిశీలనకు వచ్చిన జిల్లా మైనింగ్ అధికారులను గ్రామంలోకి రాకుండా పెద్దఎత్తున గ్రామస్థులు అడ్డుకున్నారు. దాదాపు అరగంట పాటు రోడ్డుపై బైఠాయించారు. అధికారులు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా అంగీకరించ లేదు. గ్రామపెద్దలు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వాలన్నారు. 2018లో ఇదే ప్రాంతంలో మైనింగ్ బ్లాస్టింగ్‌తో భారీ ప్రాణనష్టం జరిగిందని, ఇప్పుడు అనుమతులు ఎలా ఇస్తారని ఆగ్రహించారు. బ్లాస్టింగ్ జరిగితే ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉందని, వెంటనే అనుమతులు రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. మైనింగ్‌కు అనుమతులు ఇచ్చిన కొండ ప్రాంతాన్ని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్, ఆర్ఐ బసవన్నగౌడ్ కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసిన గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవిచంద్ విలేకరులతో మాట్లాడారు. 2005లో ఈప్రాంతంలో రెవెన్యూ అధికారు లు నో అబ్జెక్షన్ ఇవ్వడంతో 2021లో శాంత శేఖర్ అనే వారి పేరు మీదుగా ప్రభుత్వం మైనింగ్‌కు అనుమతులిచ్చిందని గ్రామస్థులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఇచ్చారన్నారు. మైనింగ్‌తో ప్రజలకు ఇబ్బందులుంటే పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ఇక్కడ ప్రజల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని బ్లాస్టింగ్ జరగకుండా చూస్తామన్నారు. మైనింగ్ లీజు రద్దుకు సంబంధించి కలెక్టర్‌కు నివేదిక ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైల్వే వరాలు..!

(5వ పేజీ తరువాయి)



నిధులు కేటాయించారు. రూ.165 కోట్లు అవసరమని ప్రస్తావించారు. మంత్రాలయం రోడ్ (తుంగభద్ర), మాధవరం, మంత్రాలయం, ఇబ్రహింపురం, నందవరం, ఎమ్మిగనూరు, గోనేగండ్ల, కోడుమూరు, గూడూరు, నాగులాపురం, పెద్దకొట్టాల, దూపాడు స్టేషన్ వరకు 110.700 కి.మీలు రైలుమార్గం నిర్మాణం కోసం సర్వే చేసి దక్షిణ మధ్య రైల్వే శాఖకు నివేదిక పంపారు. 14 రైల్వేస్టేషన్లు, 22 మలుపులతో రూట్‌మ్యాప్ తయారు చేశారు. 2010లో అప్పటి రైల్వే మంత్రి మమత బెనర్జీ పచ్చజెండా ఊపుతూ బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించారు. ఆ తరువాత పాలకుల నిర్లక్ష్యం, ఎంపీలు, ఎమ్మెల్యేలు గట్టిగా ప్రయత్నాలు చేయకపోవడంతో మరుగున పడింది. తాజాగా రీ సర్వేకు రూ.28 లక్షలు కేటాయించడంతో రైల్వేలైన్ నిర్మాణంపై మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అమృత్ స్టేషన్లకు మహర్దశ

కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద రూ.42.6 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపట్టారు. 2023 ఆగస్టు 5న ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. వెంకటరమణ కాలనీ వైపు రెండవ ప్రధాన ప్రవేశ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్) నిర్మాణం. పార్కింగ్, రైల్వే బుకింగ్ కౌంటర్, తూర్పు వైపున ప్రస్తుత ప్రధాన ద్వారం ముఖచిత్రం పూర్తిస్థాయిలో నవీకరణ, సుందరీకరణ, తూర్పు, పడమర ద్వారాలు కలుపుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి.. వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే ఆదోని రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు సైతం సాగుతున్నాయి. తాజాగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయడంతో గడువులో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని రైల్వే అధికారులు అంటున్నారు. అలాగే.. గుంతకల్లు - గుంటూరు వయా డోన్, నంద్యాల రైల్వే డబ్లింగ్, విద్యుద్ధీకరణ (401.77 కి.మీలు) పనులకు రూ.1,944.97 కోట్లు, అకోలా - డోన్ వయా మహబూబ్‌నగర్, కర్నూలు (626 కి.మీలు) డబ్లింగ్, విద్యుద్ధీకరణ పనులకు రూ.4,686.09 కోట్లు కేటాయించారు. ఈ రెండు ప్రాజెక్టు పనులు ఉమ్మడి జిల్లాలో కొంత భాగం జరుగనున్నాయి.

● ఉమ్మడి జిల్లాలో వివిధ రైల్వే ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపుల వివరాలు (రూ.కోట్లల్లో)

రైల్వే ప్రాజెక్టు	2025-26 బడ్జెట్
కర్నూలు రైల్వే కోచ్ మిడ్ లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్ షాప్	540.14
నంద్యాల - ఎర్రగుంట్ల (126 కి.మీలు)	1,029
గుంతకలు వెస్ట్ - మల్లప్పగేట్ బైపాస్ లైన్	293.30
గుంతకల్లు వెస్ట్ - నంచర్ల స్టేషన్	164.58
మంత్రాలయం - మటమారి డౌన్ లైన్	440
దూపాడు స్టేషన్ రెండు అదనపు రైల్వే లైన్లు	14.57
డోన్-బోగోలు, డోన్-మల్కాలపురం మధ్య రోడ్ లెవల్ బ్రిడ్జిలు	19.45
కర్నూలు సిటీ - దూపాడు మధ్య 144 రోడ్ క్రాస్ బ్రిడ్జి	20.35

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి ఫరూక్



సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాలు నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ఎంతో విలువైన సేవలను అందిస్తోందన్నారు.

అనుమతి లేకుండా బోట్లు తిప్పితే చర్యలు

కొత్తపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీశైలం రిజర్వాయరులో ప్రభుత్వ అనుమతులు లేకుండా మరబోట్లు తిప్పితే సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ జయశేఖర్ హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇటీవల కృష్ణానదిలో మరబోట్లు తిప్పుతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి బోటును సీజ్ చేశామని చెప్పారు.

పంట కాలువలకు నీటి విడుదల



బ్రాహ్మణ చెరువు వద్ద జలహారతి ఇస్తున్న ఇరిగేషన్ డీఈ

బండిఆత్మకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): నారాయణాపురంలోని బ్రాహ్మణ చెరువు తూము వద్ద శనివారం చైర్మన్ మద్దినేని శంకర్ ఆధ్వర్యంలో అర్చకుడు చేత పూజలు చేయించి గంగాదేవికి పసుపు, కుంకుమ, పూలు చీర సమర్పించారు. అనంతరం తూము లాక్ తీసి నీటిని పంట కాలువలకు, నారు మడులకు విడుదల చేశారు. జలమే అన్నింటికీ ఆధారమని ఇరిగేషన్ డీఈ మురళీకృష్ణ అన్నారు. ఏఈ అర్జున్‌సింగ్, నాయకులు కృష్ణుడు, వెంకట సుబ్బయ్య, ఖాదర్‌బాషా, నాగిరెడ్డి, అనతయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

మహానంది, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి సూచించారు. సీతారామపురం గ్రామంలో శనివారం సాయంత్రం సీఐతో పాటు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పర్యటించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను అంతం చేద్దాం

- నెల తర్వాత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తులపై జరిమానాలు
- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు నెలరోజుల పాటు సమయం ఇస్తున్నామన్నారు. ఈ నెల రోజుల సమయంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందన్నారు. నెలరోజుల తర్వాత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తి, నిల్వ, వినియోగం, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తులపై జరిమానాలు ఖరారు చేసినట్లు తెలిపారు. నిషేదిక ఎస్‌యూపీ తయారీ, దిగుమతి చేసిన వారిపై మొదటి తప్పిదం కింద రూ.50వేలు జరిమానా, రెండో సారి చేస్తే రూ.లక్ష జరిమానాతో పాటు ఉత్పత్తుల జప్తు, ఫ్యాక్టరీ, యంత్రాల జప్తు, పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉత్పత్తిదారులు, దిగుమతిదారులు, ఈ కామర్స్ సంస్థలు, నిల్వ, పంపిణీ చేసిన వారిపై మొదటి తప్పిదంగా రూ.25 వేలు, కిలోకు రూ.10ల జరిమానా విధించి ఉత్పత్తులను జప్తు చేస్తామన్నారు. రెండోసారి తప్పిదం చేస్తే రూ.50వేలు, కిలోకు రూ.20, ఉత్పత్తుల జప్తు చేస్తామన్నారు. వీధి వ్యాపారులు ఎస్‌యూపీ ఉత్పత్తులను వాడితే మొదటి సారి రూ.20వేలు జరిమానాతో పాటు జప్తు చేస్తామన్నారు. రెండోసారి చేస్తే రూ.40వేలు జరిమానా ఉత్పత్తుల జప్తు, లైసెన్స్ రద్దు, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రవాణా చేస్తున్న వారిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రవాణాశాఖ అధికారులు, కమర్షియల్ ట్యాక్స్ అధికారులతో పట్టుబడిన వారికి మొదటిసారిగా రూ.25వేలు, కిలోకు రూ.10లు, ఉత్పత్తుల జప్తు ఉంటాయన్నారు. రెండోసారి పట్టుబడితే రూ.50వేలు, కిలోకు 20లు జరిమానా, ఉత్పత్తుల వాహనాలు జప్తు, పర్యావరణ చట్టం కింద చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

పాములపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఎరువుల గురించి ఆందోళన చెందనవసరం లేదని, మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా, మద్దూరు ప్రాథమిక సహకారసంఘం ద్వార రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ న్యానో యూరియా వాడటం వల్ల మంచి ఫలితాలు ఉన్నాయని సూచించారు. వాణాల 23.94, మిటకందాలలో 47.88, మద్దూరులో 95, పాములపాడు1లో 23.94, చెలిమిళ్లలో 50.85 గ్రామాలలో మొత్తం 298.49 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని తెలిపారు. అలాగే 42.. 12 మెట్రిక్ టన్నుల డీఏపీని పంపిణీ చేశామన్నారు. అలాగే ఎర్రగూడూరు, పాముల పాడు 1, ఇస్కాల, వాణాల, మద్దూరు గ్రామాలకు సంభందించి 118. 88 యూరియా, 60 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరం ఉందని ఏపీ మార్క్‌ఫెడ్ నంద్యాల వారికి ఇండెంట్ పెట్టామని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

- 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర'లో ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు

నందికొట్కూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకుందామని ఎమ్మెల్యే జయసూర్య పిలుపు నిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బిజినవేముల గ్రామంలో శనివారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. దీనిపై ఎమ్మెల్యే జయసూర్య ప్రజలకు, అధికారులకు సూచనలు చేస్తూ వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాన్, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ అరుణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాదురి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనూరాధ, ఏపీఎం శ్రీనివాస్, ఉపాది సిబ్బంది, పాల్గొన్నారు.

నందికొట్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపాల్టీలో ఉత్తమ సేవలు చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సాన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మిడుతూరులో ప్రత్యేక అధికారి జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధంపై భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్లాస్టిక్ విక్రయించకూడదని షాపుల యజమానులకు నోటీసులు ఇచ్చారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగించకూడదని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దశరథరామయ్య, డిప్యూటీ ఎంపీడీవో సంజన్న, ఎంఈవోలు ఫైజున్నీసా, మల్లికార్జున నాయక్, హెచ్ఎం సాయితిమ్మయ్య, సర్పంచ్ జయలక్ష్మమ్మ, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాములపాడు: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని మండల ప్రత్యేక అధికారి రాజు సూచించారు. పాములపాడులో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కలిసి స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాపార సముదాయాల్లో ప్లాస్టిక్ వాడకూడదని దుకాణ యజమానులకు నోటీసులు అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

పగిడ్యాల: స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పగిడ్యాలలో మండల ప్రత్యేకాధికారి నగేష్, ఎంపీడీవో ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషన్న, వివిధ శాఖల అధికారులు



బిజినవేములలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణం లోని గౌడ్ సెంటర్‌లో ప్లాస్టిక్‌ను రూపుమాపుదాం అనే నినాదంపై ప్లాస్టిక్ కారకాల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్ నిర్మూలన సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మెప్మా సీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బండిఆత్మకూరు: సమాజాన్ని పట్టిపీడిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరమికొట్టాలని జేసీ విష్ణుచరణ్ పిలుపునిచ్చారు. బండిఆత్మకూరులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. ముందుగా బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలతో, అధికారులతో జేసీ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సంతజూటూరు, ఎ.కోడూరు సొసైటీలలో సీఈవోలు గోపాల్, శ్రీనువాసులు, స్టేషన్‌లో ఎస్ఐ జగన్మోహన్, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ సవిత ఆధ్వర్యంల ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ పద్మావతమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణవేణి, సర్పంచ్ సంధ్య, డాక్టర్ అనూష, డీటీ గురున్నాథం, టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, లక్ష్మిరెడ్డి, జాకీర్, అంజాద్, వీఆర్వోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహానంది: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా అంటూ దుకాణదారులపై ప్రత్యేకాధికారి ఎస్.వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలో ఎంపీడీవో మహమ్మద్‌దౌలా, పంచాయితీ కార్యదర్శి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి



బండిఆత్మకూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ, అధికారులు

వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. బుక్కాపురం, గోపవరం గ్రామాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎంఈవో రామసుబ్బయ్య, తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

వెలుగోడు: వెలుగోడు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయపాల్, డిప్యూటీ ఎంపీడీవో మురారి, కార్యదర్శి నరేంద్ర, సిబ్బంది అనిల్ పాల్గొన్నారు.

గోస్పాడు: పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రధాన లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గోస్పాడు, పసురపాడు, జూలేపల్లె, అన్ని గ్రామాల్లో అధికారులు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాడితే చర్యలు తీసుకుంటామని దుకాణాదా రులకు నోటీసులు ఇచ్చారు. ఎంపీడీవో అమానుల్లా, ఈవోఆర్డీ నాగ అనసూయ, ఏపీవో గంగన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడివేముల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. మండలంలోని బూజనూరు గ్రామంలో శనివారం స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ప్లాస్టిక్ వాడకూడదని ప్రజలతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. సర్పంచ్ రాములమ్మ, పంచాయతీ కార్యదర్శి షబాన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాండ్ర జన్మదిన వేడుకలు



అల్లూరులో కేక్ కట్ చేస్తున్న మాండ్ర శివానందరెడ్డి దంపతులు

నందికొట్కూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి జన్మదిన వేడుకలను ఆయన స్వగ్రామం అల్లూరులో అభిమానులు, నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వీరి సమక్షంలో మాండ్ర దంపతులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో ఉన్న అన్ని ఎత్తిపోతల పథకాలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి సకాలంలో రైతులకు సాగు, తాగు నీరు అందించడానికి మాండ్ర శివానందరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు నాయుడుతో ప్రత్యేకంగా చొరవ తీసుకుని మల్యాల ఎత్తిపోతల నుంచి కూడా రెండు పంపులను కేసీ కెనాలుకు ఏర్పాటు చేయించిన ఘనత మాండ్రదేనని అన్నారు. మాండ్ర సురేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మాండ్ర శివానంద రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్ రెడ్డి, నరసింహగౌడు, షబ్బు బాషా, ఇద్రూష్, రాముడు, గోకారి తదితర నాయకులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలియజేస్తున్న దామోదర్‌రెడ్డి

పగిడ్యాల: మాండ్ర శివానందరెడ్డి శనివారం అల్లూరులోని ఆయన నివాసంలో పగిడ్యాల సింగిల్‌విండో చైర్మన్ బొగ్గుల దామోదర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. పగిడ్యాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. అనంతరం అక్కడ కేక్ కట్ చేసి ఆయనకు శుభకాంక్షలు తెలిపారు. అలాగే నెహరానగర్ కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రాగుల రామస్వామి మాండ్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

- నెహ్రూనగర్ గ్రామంలో టీడీపీ సీనియరు నాయకులు రామిరెడ్డి ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అల్లూరు గ్రామంలోని మాండ్ర నివాసానికి చేరుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ నాయకులు వి. రామిరెడ్డి, షరీఫ్, శ్రీనాథ్‌రెడ్డి, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం: ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇది ప్రజా ప్రభుత్వం అని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు మండలంలోని బిజినవేముల గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్య నాయకులు, కార్యకర్తల తో కలిసి రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రవియాదవ్, టీడీపీ నాయకులు చిన్న లింగన్న,కాంతారావు, రమణయ్య, సతీష్,కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి: ఈవో



పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరావు

నంద్యాల కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): శిఖరేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టాలని శ్రీశైల క్షేత్ర ఈవో శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆలయాన్ని సందర్శించారు. ఈవో మాట్లాడుతూ శిఖరేశ్వర ఆలయ పుష్కరిణి వద్ద కోనేరు విశిష్టతను, క్షేత్ర విశేషాలను బొమ్మలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. విరాశాల కేంద్రం ఏర్పాటు, ఉచిత పాదరక్షలు భద్రపరుచుకునే స్థలం, వీరభద్రస్వామి ముందుభాగంలో గ్రిల్ తదితర పనులు చేపట్టాలన్నారు. ఈఈ నరసింహారెడ్డి, సహాయ ఇంజనీర్లు ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

నంద్యాల కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో శనివారం దేవస్థానం తరుపున నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద భవనాశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, మేడ్చల్ వారితో సంప్రదాయ నృత్యప్రదర్శన నిర్వహించారు. అనంతరం హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం



ఆత్మకూరులో దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం): శ్రీశైలం క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ కోసం పులివెందులకు చెందిన సాయినాథరెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు అయ్యన్న దాతకు రసీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రాలు అందించారు. అనంతరం అర్చకులు దాతను ఆశీర్వదించారు.

ఆత్మకూరు: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆర్.లక్ష్మీనారాయణ, శోభారాణి తమ తల్లిదండ్రులు పుల్లయ్యశెట్టి, సుభద్రమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళం అందజేశారు. శనివారం ఆలయ కమిటీ చైర్మన్, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, శాశ్వత అన్నదాన కమిటీ చైర్మన్ రామయ్యకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు దాతలను ఘనంగా సత్కరించారు. అలాగే అర్చకులు వారికి స్వామి, అమ్మవార్ల వేదాశీర్వచనాలు అందజేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి జక్కాముర‌ళీ, అర్చకులు అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

మహానంది, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గాజులపల్లి పీహెచ్‌సీని శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్యకేంద్రం పరిసరాల్లో స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలను సిబ్బందితో కలసి తొలగించారు. అనంతరం గాజులపల్లి ఆర్ఎస్ చెంచుకాలనీలో సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. వైద్యాధికారి వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అహిర్ రెజిమెంట్ ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్ ఏర్పాటుచేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ జోన్ కన్వీనర్ శేషఫణి యాదవ్, రాయలసీమ యూత్ అధ్యక్షులు శివరామకృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ తదితరులు కోరారు. రేజాంగ్ లా కలశ యాత్ర శనివారం ఆత్మకూరుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ కాగా 1962లో జరిగిన భారత్ - చైనా యుద్ధంలో 114 మంది యాదవ సైనికు లు అమరులయ్యారని, వారికి జ్ఞాపకంగా ఏర్పాటు చేసిన రెజిమెంట్‌ను కేంద్రం తొలగించిందని, మళ్లీ రెజిమెంట్ ఏర్పాటుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు రమణయాదవ్, శ్రీరాములుయాదవ్, సుంకన్న, నాగన్నయాదవ్, నారాయణ యాదవ్, ఓబులేసు, నాగశేషులు, రాజేష్, నాగశేషులు, సుబ్బరాయుడు ఉన్నారు.

పాములపాడు: భారత సైన్యంలో యాదవ రెజిమెంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రెజాంగ్ లా కలశ యాత్ర నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షురాలు మమహేశ్వరి, యాదవ మహిళాసంఘం అధ్యక్షులు నాగ మల్లేశ్వరి అన్నారు. కలశయాత్రలో బాగంగా శనివారం పాముల పాడుకు చేరుకోగా మండల యాదవసంఘం నేతలు మందాడి మల్లికార్జునయాదవ్, జాలా రామ్మోహన్, సురేశ్‌యాదవ్, నాగేశ్వరరావు యాదవ్ స్వాగతం పలికారు. బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు.



వెలుగోడులో స్వాగతం పలుకుతున్న యాదవులు

వెలుగోడు: యాదవ రెజాంగ్ లా కలశయాత్రకు వెలుగోడు మండలంలో యాదవులు ఘనంగా స్వాగతం పలికారు. యాదవసంఘం నాయకులు మోహనరావు, శేషఫణియాదవ్, రఘురాముడు యాదవ్, శివక్రిష్ణయాదవ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన రెజాంగ్ లా యాత్ర శనివారం పాణ్యానికి చేరుకుంది. మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి మాట్లాడుతూ అహిర్ రెజిమెంట్ పునరుద్ధరించకపోతే నవంబరు 18న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దేశవ్యాప్తంగా ఉన్న యాదవులు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. శివకృష్ణ, శ్రీనివాసులు, సునీల్, గుర్రప్ప, సుబ్బకృష్ణ, బాలరాజు,వంశీకృష్ణ, బందారు నాగేశ్వరరావు, శంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలివ్వాలి

- జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీందర్‌కుమార్
- బ్యాంకులు రైతులకు ఆర్థికసాయం మెరుగుపర్చాలి
- నాబార్డు డీడీఎం కార్తీక్



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీందర్ కుమార్

నందికొట్కూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అన్ని బ్యాంకులు అర్హత కలిగిన కౌలురైతులకు పంట రుణాలివ్వాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీందర్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో నాబార్డు డీడీఎం కార్తీక్‌తో కలిసి ఆయన బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రవీందర్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంక్‌లు కొనసాగిస్తున్న నియోజకవర్గ, మండల స్థాయి జనసురక్షా శిబిరాల్లో అధికారులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. బ్యాంకుల్లో ఖాతాదారుల పాతఖాతాల రీకేవైసీని మెరుగుపర్చాలన్నారు. పశుసంవర్ధక, మత్స్య, ఫైనాన్స్ ఆర్థిక సహాయం చేయాలని, పీఎంఎఫ్‌బీవైకింద అర్హత కలిగిన పంట రుణాలను గడువులోపు కవర్ చేయాలన్నారు. నాబార్డ్ డీడీఎం కార్తీక్ మాట్లాడుతూ బ్యాంకులు రైతు ఉత్పత్తి దారుల సంస్థలకు, వ్యవసాయ కాలపరిమితి రుణాలు, వ్యవసాయ క్లినిక్‌లు, వ్యాపార కేంద్రాలు, ఉద్యాన, పాడి పరిశ్రమలకు ఆర్థిక సాయం మెరుగు పరచాలన్నారు. పీఎం ఎంయూఎఫ్ఎటీ బిజిలీ యోజన కింద ఆర్థిక సహాయానికి బ్యాంకులు మద్దతు ఇవ్వాలన్నారు. మహిళలకు ఎస్ఎస్‌జీ ఫైనాన్స్ ను పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో మహిళల నేతృత్వంలోని ఎంటర్ ప్రైజెస్ ఫైనాన్స్‌ను కూడా మెరుగు పరచాలన్నారు. ఎంపీడీవో సుబ్రమణ్యశర్మ, డీపీఎం నంద్యాల రంగారావు, వివిధ శాఖల అధికారులు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం విఫలం

- వైసీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి సుధీర్



మిడుతూరులో ప్రజలతో మాట్లాడుతున్న సుధీర్

మిడుతూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని వైసీపీ నందికొట్కూటరు ఇన్‌చార్జి ధారా సుధీర్ ఆరోపించారు. మిడుతూరులో శనివారం 'బాబు షూరిటీ. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. హామీలను ప్రభుత్వం విస్మరించిందని సుధీర్ ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ లోకేశ్వరరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, శివనాగిరెడ్డి, నబీరసూల్, నారాయణరెడ్డి, హరిసర్వోత్తమరెడ్డి, స్వామిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లి: రైతులకు సకాలంలో ఎరువులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, దీంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధారా సుధీర్ ఆరోపించారు. కొత్తపల్లిలోని ఆ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి స్వగృహ ఆవరణంలో ఆ పార్టీ మండల కన్వీనర్ కే.సుధాకర్ రెడ్డి అధ్యక్షతన శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ సోముల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ బాల ఎల్లయ్య, వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహబూబ్ బాషా, గౌస్, నాగ ఎల్లయ్య, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, లింగారెడ్డి, అయ్యప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఆత్మకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరుకు చెందిన బొరెల్లి రాజేష్ శనివారం ఆత్మకూరులో ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. రాజేష్ తన భార్య స్వగ్రామమైన కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల నివాసం ఉంటున్నారు. ఇక్కడే ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. గువ్వలకుంట్లకు చెందిన ఆటో డ్రైవర్లు యూనియన్‌గా ఏర్పడి ఆటోలను సీరియల్‌గా నడుతుంటారు. ఈక్రమంలోనే ఆ యూనియన్ తరుపున ఒక చీటీ నడుకునేవారు. అయితే చీటి ఎత్తుకున్న రాజేష్ మూడు కంతులు చెల్లించి మిగతా కంతుల చెల్లింపులో జాప్యం వహించినట్లు తెలిసింది. దీంతో ఆటో యూనియన్ వారు అతని ఆటోను సీరియల్‌లో ఉంచబోమని, చీటి కంతులు చెల్లించాలని దురుసుగా వ్యవహరించినట్లు తెలిసింది. రాజేష్ శనివారం పురుగుల మందు తాగి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన్ని వెంటనే ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని కర్నూలుకు సిఫారసు చేశారు. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు అర్బన్ సీఐ రాము వెల్లడించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

బంగారు కుటుంబాల అభివృద్ధే లక్ష్యం: పీడీ

ఉయ్యాలవాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆయా గ్రామాల్లో ఉన్న బంగారు కుటుంబాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బోడెమ్మనూరు గ్రామంలో పీ-4 కుటుంబాలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు సువర్ణదేవి, ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, ఆయా శాఖల అధికారులున్నారు.

రుద్రవరం: పేదల భవితకు పీ-4 బంగారు బాట అని తహసీల్దార్ మల్లికార్జునరావు అన్నారు. శనివారం ఆలమూరు పంచాయతీలో మార్గదర్శక బంగారు కుటుంబాల ప్రోగ్రామ్‌లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాణ్యం లక్ష్మిదేవి, కార్యదర్శి పాములేటి, టీడీపీ నాయకులు పత్తి బ్రహ్మయ్య, పత్తి బాచుపల్లె వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయం

ప్యాపిలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని మండల ఉద్యానవన శాఖ అధికారి కళ్యాణి అన్నారు. శనివారం ప్యాపిలిలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు ఖాజాపీరా, ఎస్‌కే వలి, ఉద్యానవన శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండంపాడు గ్రామంలో..

శిరివెళ్ల : మండలంలోని గుండంపాడు గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు రైతులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి బీసీ


ధరణి(ఫైల్)

కోవెలకుంట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఓ మార్ట్‌లో ధరణి(22)అనే యువకుడు పని చేసేవాడు. అయితే, శనివారం స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పట్టణానికి రాగా, బస్టాండు వద్దకు యువకుడు చేరుకుని అక్కడ స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేశారు. తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. సీఐ హనుమంతనాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. యువకుడి మృతిపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కంబగిరి స్వామికి వెండి నామాలు సమర్పణ

ఉయ్యాలవాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్ద మల్ల గ్రామంలో వెలసిన కంబగిరి స్వామివారికి నంద్యాల జిల్లా అయ్యలూరు మెట్ట గ్రామానికి చెందిన తలారి కొండయ్య, వెంటలక్ష్మి దంపతులు వెండి నామాలు సమర్పించినట్లు ఆలయ అర్చకుడు కమలేశ్వరశర్మ తెలిపారు. ముందుగా దంపతులు స్వామి వారి దర్శించుకొని పూజలు చేశారు. వాటిని స్వామివారికి అలంకరించారు.

కడప జిల్లాకు కృష్ణాజలాలు

చాగలమర్రి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వంగలి గ్రామ సమీపంలోగల 96 కి.మీ వద్ద ఏర్పాటు చేసిన క్లస్టర్ గేట్లనుఎత్తి కడపజిల్లా వైపునకు కృష్ణా జలాలను తరలించినట్లు టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 94 కి.మీ వద్ద 1,500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోం దని అన్నారు. కార్యక్రమంలో టీజీపీ సిబ్బంది ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

చాగలమర్రి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ సీఐ భీముడు నాయక్ తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో ఉన్న పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. అగ్నిమాపకానికి సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసుకొని ప్రమాదాలు జరుగకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట అగ్నిమాపకదళ సిబ్బంది ఉన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

కొలిమిగుండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తోళ్లమడుగులో శనివారం చెత్త బుట్టలను పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఆదినారాయణరెడ్డి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు నాగిరెడ్డి, వీఏఏ సందీప్, రాజ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి సాగుకు రైతన్న సన్నద్ధం

- కుందూనదిలో భారీగా నీటి ప్రవాహం
- నిండు కుండలా రూపనగుడి చెరువు

ఉయ్యాలవాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా మండలంలోని రైతులు ఈఏడాది ఖరీఫ్‌లో మూడు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వెయ్యి ఎకరాలు అదనంగా వరి సాగు చేస్తున్నారు. మండలంలో ఉన్న 21 గ్రామాల్లో 18 గ్రామాలు కుందూ, పాలేరు, చెరువుల ఆయకట్టు కింద ఉన్నాయి. మండలంలోని మాయలూరు, సుద్దమల్ల, అల్లూరు, రూపనగుడి గ్రామాల్లో ఇప్పటికే వరినాటుకు మడులను సిద్ధం చేస్తున్నారు. శనివారం మాయలూరులో రైతులు వరి నాట్లు వేశారు.


రుద్రవరం మండలం వెలగలపల్లెలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

కుందూనది, పాలేరు వాగుల్లో నీటి ప్రవాహం

మండలంలోని కుందూ, పాలేరు నదుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంది. ఇటీవల కుందూనదికి నీటిని విడుదల చేశారు. కుందూ నది కింద దాదాపుగా రెండు వేల ఎకరాల్లో ఆయకట్టు సాగు అవుతుంది. పాలేరు వాగు కింద దాదాపు 300 ఎకరాల్లో పంట సాగు అవుతుంది.

చెరువుల్లో జలకళ

మండలంలోని రూపనగుడి, తుడుమల దిన్నె గ్రామాల చెరువుల్లో నీరు జలకళగా ఉంది. ఆయా గ్రామాల ఆయ కట్టు రైతులు వరి పం ట సాగుకు సిద్ధం అవుతున్నారు. రూపనగుడి గ్రామంలోని రైతులు నారుమల్లు తయారు చేసి అందులో మొలక చాల్లారు. మరో 30 రోజుల్లో ఈ ఆయకట్టు కింద దాదాపుగా 700ఎకరాల్లో వరి పంట సాగు అవుతుంది.

ఏడేళ్ల తరువాత ఆయకట్టు కింద వరి సాగు

మండలంలోని రూపనగుడి గ్రామ చెరువు ఆయకట్టు కింద దాదాపుగా ఏడేళ్ల తరువాత వరి పంట సాగు అవుతుంది. ప్రతి ఏడాది చెరువులో నీళ్లు ఉన్నా కాని ఆ గ్రామ రైతులు వరి సాగు చేసేవారు కాదు. ఇటీవల ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరువ చూపి చెరువును మరమ్మతు చేయించారు. అలాగే పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు ఆయకట్టు కింద వరిపంట సాగుకు సిద్ధం అవుతున్నారు. ఈ ఆయకట్టు కింద దాదాపుగా 350 ఎకరాల్లో వరిపంట సాగవుతుంది.

బోరుబావుల కింద వరి నాట్లు

రుద్రవరం : రైతులు వ్యవసాయ బోరుబావుల కింద వరి నాట్లు జోరందుకున్నాయి. రుద్రవరం మండలంలోని ఆలమూరు, ముకుందాపురం, చిత్తరేణిపల్లె, వెలగలపల్లె, కొండమాయపల్లె తదితర గ్రామాల్లో ముందస్తుగానే వరి నాట్లు సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలో సుమారు 400 ఎకరాల్లో వరినాట్లు వేశారు.

ప్రవహిస్తున్న పాలేరు వాగు

సంజామల: మండలంలోని పది గ్రామాలకు సాగునీరు అందించే పాలేరు వాగు ప్రవహిస్తుండడంతో పరివాహక ప్రాంతాల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నెల చివరివారం నుంచి ఈనెల 15 వరకు పాలేరు వాగు వట్టిపోయింది. దీంతో పరివాహకంలో తాగు, సాగునీటి సమస్య ఎదుర్కొన్నారు. ఈనెల 8న సీఎం చంద్ర బాబు నాయుడు శ్రీశైలం రిజర్వాయర్ గేట్లు ఎత్తి దిగువకు కృష్ణాజలాలు విడుదల చేశారు. ఎస్సార్బీసీ ద్వారా అవుకు రిజర్వాయరుకు చేరి గొల్లలేరు డ్రయిన్ ద్వారా పాలేరు వాగుకు చేరాయి. ఏడాది ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలు కురవడంతో అత్యధిక విస్తీర్ణంలో మొక్కజొన్న, మినుములు సాగు చేశారు. వరినాట్లు వేసేందుకు నారుమళ్లు పోసుకున్న రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో పాలేరు వాగు ప్రవహించడం, మూడు రోజులు నుంచి వర్షాలు కురియడంతో వరిరైతులు సంబరం పడుతున్నారు.


నిండు కుండలా ఉన్న రూపనగుడి చెరువు


నాటుకు సిద్ధంగా ఉన్న నారుమడి

అభివృద్ధే లక్ష్యం: మంత్రి

అవుకు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే తమ లక్ష్యమని రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను సాగనీవ్వమన్నారు. శనివారం మండలంలోని శివవరం గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి హాజరైన మంత్రికి గ్రామ టీడీపీ నాయకులు బొల్లపు రాజశేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మల్లు శేఖర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రూ. 60 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీని ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ గ్రామంలో తన సొంత నిధులతో రెండు నెలల వ్యవధిలోనే మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, బనగానపల్లె మార్కెట్‌యార్డ్ చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, టీడీపీ నాయకులు మెట్ల రామిరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, వెంకటరమణనాయక్, దంతెల రమణ, తిక్కన్న, అరుణ్‌కుమార్‌నాయక్, వెంకటరాముడునాయక్, సాంబశివారెడ్డి, పక్కీరగౌడు, పుల్లయ్య, బైరెడ్డి భాస్కర్‌రెడ్డి, శంకర్, జగదీశ్వరరెడ్డి, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


శివవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పంటలకు ప్రాణం పోసిన వర్షం

కొలిమిగుండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన మోస్తరు వర్షం అన్నదాతలు సాగు చేసిన ఖరీఫ్ పంటలకు ప్రాణం పోసినట్లయ్యింది. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో మొక్కజొన్న, పత్తి, మినుము, కంది తదితర పంటలను సుమారు ఐదు వేల ఎకరాల విస్తీర్ణంలో అన్నదాతలు సాగు చేశారు. అయితే సాగు చేసినప్పటి నుంచి చినుకు జాడ లేకపోవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల క్రితం మండలంలోని 30మీ.మీ వర్షపాతం కురిసింది. మరోమారు శనివారం సాయంత్రం మండలంలోని ఇటిక్యాల, కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె, మదనంతపురం, అబ్దులాపురం తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతల ఆశలు చిగురిస్తున్నారు. సాగు చేసిన పంటలకు ఈవర్షం కాస్త ఊపిరి పోసిందని రైతులు హర్షం వ్యక్తంచేశారు.


కొలిమిగుండ్లలో కురుస్తున్న వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్యాపిలి: మండలంలోని రామక్రిష్ణాపురం, మాధవరం గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఇళ్లలోకి వర్షం నీరు ప్రవేశించింది. ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కాగా గ్రామంలోని వర్షపు నీరు వెళ్లే వంక మార్గంలో కొందరు దౌర్జన్యంగా అక్రమ కట్టడాలు నిర్మించుకోవడం వల్లనే నీరు ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మూడేళ్లుగా అక్రమ కట్టడాలు తొలగించమని అధికారులకు చెబుతున్నా స్పందన లేదని రామక్రిష్ణాపురం వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కట్టడాలని తొలగించి వర్షపు నీరును మళ్లించాలని గ్రామస్థులు కోరారు.


ప్యాపిలి: రామక్రిష్ణాపురంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. వక్తలు మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. బనగానపల్లెలో డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, బేతంచెర్లలో డోన్ ఆర్డీవో నరసిం హులు, కమిషనర్ హరిప్రసాద్, డోన్‌లో మున్సిపల్ వైస్‌చైర్మన్ కోట్రికే హరికిషన్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఆయా మండలాల్లో స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవో, తహసీల్దార్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

\- నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



బనగానపల్లెలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి


బేతంచెర్లలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు



డోన్‌లో..



దొర్నిపాడులో..


కొలిమిగుండ్లలో..


అవుకులో..


సంజామలలో..

యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దు: ఏవో

రుద్రవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యూరియాను కృత్రిమ కొరత సృష్టించొద్దని ఏవో సుమతి ఆదేశించారు. శనివారం రుద్రవరంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పంటలకు అవసరం మేరకే యూరియాను రైతులు వాడాలన్నారు. ఎరువుల దుకాణాల వద్ద స్టాకు బోర్డు, ధరల పట్టికను ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

వాసాపురంలో ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మలు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్లకు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నరసాపురం, రుద్రవరం గ్రామాల్లోని దొర్వి, గుట్టకొండ నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి

ఉయ్యాలవాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మోడల్ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని ఎంఈవో-1 రఘురామిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి , ఉపాధ్యాయుడు ఆదాం తదితరులున్నారు.

బనగానపల్లె ఈవోఆర్‌డీగా బాలాంజనేయులు

బనగానపల్లె, జూలై 19(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీగా బాలాంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు సిబ్బంది సత్కరించారు. పలుకూరు ఈవో నుంచి పదోన్నతిపై బనగానపల్లెకు వచ్చారు.

సిమెంట్ రోడ్డు వేయించాలి

● మంత్రికి టంగుటూరు వాసుల విజ్ఞప్తి

బనగానపల్లె, జూలై 19(ఆంధ్రజ్యోతి): టంగుటూరు గ్రామంలో సీసీ రోడ్లు వేయించాలని గ్రామస్థులు కోరారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలనుంచి వినతులను స్వీకరించారు.

'ఉద్యోగిపై జులుం ప్రదర్శించడం తగదు'

కొలిమిగుండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాల వాల్మీకి సామాజికవర్గం ఉద్యోగిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి జులుం ప్రదర్శించడం తగదని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్ అన్నారు. అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుపై అసభ్య పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వెంటనే జిల్లా పంచాయతీ అధికారికి జేసీ ప్రభాకరరెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బ తీసేలా వ్యాఖ్యాలు చేయడం తీవ్ర అభ్యంతరకరమన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన వసతులు

శిరివెళ్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తోందని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్య, నోట్ పుస్తకాలు, రికార్డులను ఆయన శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఆళ్లగడ్డ, జూలై19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శ్రీశైలం ఐటీడీఏ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి శనివారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. అలాగే అవుట్ పేషంట్ల రిజిస్ట్రేషన్, హైరిస్కు గర్భిణుల వివరాలు, వారికి అందిస్తున్న సేవ లు, చిన్నారులకు ఇస్తున్న వ్యాధినిరోధక టీకాల వివరాలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతిని అడిగి తెలుసుకున్నారు. విధులపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. అనంతరం అహోబిలంలోని లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ స్వాతి, డిప్యూటీ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ, ఫార్మసిస్టు వాసవి, సిబ్బంది లక్ష్మీకళ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ దస్తగిరిబాబు

శిరివెళ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తప్పనిసరిగా రహదారి నియమాలు పాటించాలని శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐ చిన్నపీరయ్య సూచించారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై గోవిందపల్లె గ్రామం వద్ద వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, చట్టాల గురించి ప్రయాణీకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోవిందనామ పారాయణం


గోవిందనామ పారాయణం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శనివారం మహిళలు సామూహికంగా గోవిందనామ పారాయణం భక్తిశ్రద్ధలతో చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో గంగమ్మ

మండలంలోని చింతలచెరువు, చాగలమర్రి గంగమ్మ ఆలయాల్లో శనివారం ఆషాఢమాసం సందర్భంగా గంగమ్మ దేవత శాకంబరి అలంకారంలో కొలువుదీరారు. మహిళలు సామూహికంగా గంగమ్మకు పండ్లు, కూరగాయలతో అలంకరించారు. సారె సమర్పించారు.

ఆరోపణలు తగవు

\- డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి

డోన్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రతిష్టకు భంగం కలిగేలా విద్యార్థి సంఘం నాయకుడు చేసిన ఆరోపణలు తగవని కళాశాల ప్రిన్సిపాల్ భారతి అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ డోన్ డిగ్రీ కళాశాలకు చెందిన ఆరుమంది విద్యార్థులు జనవరి నెలలో ఉద్యోగాల కోసం తిరుపతికి వెళ్లి అక్కడ ఇబ్బందులు పడినట్లు విద్యార్థి సంఘం నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవాలు లేవన్నారు. తమను బాధ్యులను చేయడం సరికాదన్నారు. తమ ఆసక్తితోనే వెళ్లామని విద్యార్థులు తెలిపారు.